క్లుప్తంగా

'స్వదేశీ వస్తువులనే వాడుదాం'

టేకుమట్ల : స్వదేశీ వస్తువులను వాడి దేశాభివృద్ధిలో భాగమవుదామని జనసేన నాయకుడు ఆకుల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం టేకుమట్ల మండల కేంద్రంలో స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వదేశీ వస్తువులు వాడటం వల్ల దేశ ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. రైతులకు తోడుగా ఉంటూ చిన్న తరహా పరిశ్రమలు రక్షించుకోవచ్చన్నారు. అమెరికా వంటి దేశాలు విధించే సుంకాల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రతి దుకాణంలో స్వదేశీ బోర్డులు ఏర్పాటు చేసి విక్రయించాలన్నారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రాముకి శుభాకాంక్షలు తెలియజేశారు.

పరామర్శ



మొగుళ్లపల్లి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నడిగోటి రాము సోదరి సంధ్యా అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. సంధ్యకు సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కాంస్య విగ్రహ నిర్మాణానికి మట్టి అందజేత



కాటారం : హైదరాబాద్ కొత్తపేటలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహ భూమి పూజ కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి మట్టి తీసుకెళ్లి ఆదివారం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు గోనె భాస్కర్, పద్మశాలి సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎలుబాక సుజాత తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ జింకల పార్క్‌లో దసరా మేళా ఉత్సవంలో భాగంగా 33 జిల్లాల నుంచి మట్టి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చిట్యాల : మండలంలోని కాల్వపల్లి శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం నాలుగు, ఆదివారం ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన కొత్తూరు శేఖర్, కర్నూలు స్వామి, మోర సుశాంత్, ఇందారపు గణేష్, గణపురం మండలంలోని ధర్మరావుపేటకు చెందిన ఆకుల శ్రీనివాస్, భూపాలపల్లి మండలంలోని నేరెడుపల్లికి చెందిన సంఘ దేవేందర్, గొర్రె కుమారస్వామిలు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. అనుమతి లేని ఇసుక ట్రాక్టర్లను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కాటారం : మండల కేంద్రంలో నిర్వహించిన నారమల్ల కిష్టయ్య స్మారక జీపీఎల్ (గారెపల్లి ప్రీమియర్ లీగ్) రెండో సీజన్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. దసరా సందర్భంగా చేపట్టిన టోర్నీ 15 రోజులుగా జరుగుతుండగా ప్రతాపగిరి డేంజర్–11 జట్టు, చింతకాని శాన్వి–11 జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లో శాన్వి జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, పలు పార్టీల నేతలు, నిర్వాహకులు బహుమతి ప్రదానం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి



భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గండ్రపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతంలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అయితే ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయగా, మరో ట్రాన్స్‌ఫార్మ్‌కు కంచె ఏర్పాటు మరిచారు. గతంలో ఇక్కడ పశువులు ప్రమాదానికి గురైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సమీపంలోని పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులు కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ వైపునకు వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పగలు రెక్కీ..రాత్రి చోరీ



మచ్చాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్ వైర్, ఆయిల్‌ని తీసుకెళ్లిన దొంగలు



చల్వాయిలో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రెచ్చిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు
- ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. కాపర్ వైర్, ఆయిల్ అపహరణ

గోవిందరావుపేట : కాపర్ వైర్, ఆయిల్ దొంగలు రెచ్చిపోతున్నారు.రాత్రి వేళల్లో వ్యవసాయ క్షేత్రాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఫలితంగా మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకుండా పోయింది. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు పెరిగిపోయాయి. ప్రధానంగా జాతీయ రహదారులకు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దుండగులు రెచ్చిపోతున్నారు. కేవలం కాపర్ వైర్, ఆయిల్ కోసం దొంగతనాలకు తెగబడుతున్నారు. ఇలా ఎత్తుకెళ్లిన కాపర్ వైర్, ఆయిల్‌ను బయట విక్రయిస్తే వారికి దక్కేది రూపాయల్లో మాత్రమే, కానీ ట్రాన్స్‌ఫార్మరర్ల మరమ్మతులకు అయ్యే ఖర్చు మాత్రం రైతుకు భారంగా మారుతోంది. మరమ్మతులకు ఎక్కువ రోజులు సమయం పడుతుండడంతో అప్పటి వరకు పంటలకు నీటి విడుదల నిలిచిపోతుంది. ట్రాన్స్‌ఫార్మర్ మళ్ళీ యథాస్థానానికి చేర్చడానికి నెల రోజుల సమయం పడుతోంది. గోవిందరావుపేట మండలంతో సహా వివిధ మండలాల్లో ఎక్కడో ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం కేసులు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి.

మార్కెట్లో కాపర్‌వైర్‌కు డిమాండ్..

మండలంలోని మచ్చాపూర్, చల్వాయి, రాఘవపట్నం గ్రామాల్లో ఇటీవల ఒకటే రోజు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్, అందులోని ఆయిల్ ఎత్తుకెళ్లారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్ 16 కేవీఏ, 2 ట్రాన్స్‌ఫార్మర్ 25 కేవీఏలు ఒక్కొక్క దాని విలువ సుమారుగా రూ.1.50లక్షలు ఉంటుంది. కాగా దొంగలు పగలు సమయంలో గ్రామాల చుట్టుపక్కల తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తారు. ఏ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉందో, రైతులు ఎప్పుడు వస్తారో గమనిస్తారు. ఆ తర్వాత రాత్రివేళ ఆ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకొని ట్రాన్స్‌ఫార్మర్‌ని పగులగొట్టి అందులోని కాపర్ వైర్, ఆయిల్‌ను చోరీ చేస్తారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే కాపర్ వైర్ కొన్ని కిలోల బరువులో ఉంటాయి. మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఉండటంతో దొంగలు మాఫియా తరహాలో వీటిని ఎత్తుకెళ్తున్నారు.

దొంగలకు వచ్చేది గోరంత.. రైతులకు ఖర్చు కొండంత!

దొంగలు సులభంగా విద్యుత్ కనెక్షన్ తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్, ఆయిల్‌ను దోచేస్తారు. రాత్రివేళ చీకట్లో జరిగే ఈ దోపిడీలు పగటిపూట రైతుల జీవితాలను చీకట్లోకి నెడుతున్నాయి. రైతుల పంట పొలాలకు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లే ప్రాణాధారం. దొంగతనం జరిగిన తర్వాత ట్రాన్స్‌కో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేస్తే, వారు ఎఫ్ఐఆర్ చేసిన తర్వాతనే రిపేరు లేదా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అనుమతి లభిస్తుంది. పదినుంచి 20రోజుల సమయం పడుతుంది.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి..



పొలం వద్ద మోటారు ఆన్ చేయాలని వెళ్లా.. లైట్ రావడం లేదని అనుకున్నా.. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లి చూసే సరికి ట్రాన్స్‌ఫార్మర్ మొత్తం పగులగొట్టి అందులోని కాపర్ వైర్, ఆయిల్‌ని దొంగలు ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ లేకపోతే పంటకు నీరు అందించలేము. నాలుగు నెలల నుంచి కష్టపడుతున్నాను. ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురువుతుందని అనుకోలేదు. విద్యుత్ శాఖ వాళ్లకు ఫిర్యాదు చేశాం.. కానీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ రావడానికి రెండు నెలల సమయం పడుతుందని చెప్పారు. దొంగలు కాపర్ వైర్ అమ్ముకుంటే కొంత డబ్బు వస్తుంది కావచ్చు. కానీ తాము పంటను, శ్రమను, ఆశలని కోల్పోతాం.

– దరిపల్లి సమ్మయ్య, రైతు, మచ్చాపూర్

ప్రత్యేక బృందాల ఏర్పాటు..



ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. పాత నేరస్తులను విచారించి వారిపై సైతం నిఘా పెట్టాం. మాకు దొరికిన ఆధారాలకు అనుగుణంగా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కమలాకర్, ఎస్సై, పస్రా

ఐటీసీ యాజమాన్యం జాడెక్కడ?

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

మంగపేట : మండలంలోని కమలాపురం బీజీపీపీఎల్(బిల్ట్) ఫ్యాక్టరీని టేకోవర్ చేసిన ఐటీసీ కంపెనీ జాడ ఎక్కడ అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్ ప్రశ్నించారు. మండలంలోని కమలాపురంలో గల రావినారాయణరెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ మండల మహాసభ గడ్డం భారతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీందర్ హాజరై ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏకైక భారీ పరిశ్రమ (బీజీపీపీఎల్) మూతపడి 13 ఏళ్లు గడిచిందన్నారు. మూతపడిన పరిశ్రమను పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన మంత్రులు, పార్లమెంటు సభ్యులు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన జిల్లా, మండల నాయకులు ఏమి చేస్తున్నారని, ఇంకెప్పుడు పునరుద్ధరిస్తారని ప్రశ్నించారు. మూతపడిన కర్మాగారాన్ని టేకోవర్ చేసిన ఐటీసీ యజమాన్యం ఏమి చేస్తోందని నిలదీశారు. ఈ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీని నమ్ముకున్న కార్మికులకు చెల్లించాల్సిన అనేక బకాయిలను టేకోవర్ చేసుకున్న యజమాన్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రూ.600 చెల్లిస్తు శ్రమ దోపిడీ చేస్తోందని పేర్కొన్నారు. స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, కార్మిక వర్గానికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ప్రభుత్వం ఆధీనంలోనే నిర్వహించాలని, సంక్షేమ బోర్డు నిధులను మెడికల్ టెస్టుల పేరుతో దుర్వినియోగం చేయడం మానుకుని సభ్యులకు సంక్షేమ నిధులను పెంచాలన్నారు. కార్యక్రమంలో బండి జయమ్మ, మద్దిబోయిన భారతి, ఎస్‌కే సఫియా, ఆలం హేమ, ఈసాల రమాదేవి, బల్లెం రాములు, కొడాలి తులసి, శ్రీదేవి, వాసం నాగేంద్ర, తాలూకా వెంకటనర్సమ్మ, విజయలక్ష్మి, కోరం పద్మ, అమీన, పాగ పద్మ, ఖైరున్, బుచ్చమ్మ, అఖిల, శ్రీలత, నానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడం అభినందనీయం



విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేస్తున్న మంత్రి



బీపీ చెకప్ చేసుకుంటున్న మంత్రి సీతక్క

- చిన్నబోయినపల్లిలో మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

ఏటూరునాగారం : కనిపించే దేవుళ్లు వైద్యులని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామంలో తుమ్మ కోమల–సాయిరెడ్డి, తుమ్మ జయసింహారెడ్డి జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి సీతక్క హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. తుమ్మ ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సంజీవరెడ్డిలు పేదలకు సేవచేయడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులకు నోటుబుక్స్ అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులు సేఫ్టీ జాకెట్ ధరించాలి



బోట్ డ్రైవర్లు, పర్యాటకులకు సూచనలిస్తున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం) : రామప్ప ఆలయాన్ని సందర్శించే పర్యాటకులు సరస్సును సందర్శిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటాపురం ఎస్సై చల్ల రాజు పర్యాటకులకు పిలుపునిచ్చారు. ఆదివారం రామప్ప సరస్సు బోటింగ్ పాయింట్ వద్ద బోటింగ్ డ్రైవర్లతో పాటు పర్యాటకులకు అవగాహన కల్పించారు. సరస్సులో బోటింగ్ చేసేటపుడు ప్రతి ఒక్కరూ సేఫ్టీ జాకెట్ ధరించాలన్నారు. బోట్ డ్రైవర్లు ప్రతి పర్యాటకుడికి సేఫ్టీ జాకెట్లు అందించిన తర్వాతనే బోటింగ్ ప్రయాణానికి సిద్ధపడాలన్నారు. సరస్సులో ఈత కొట్టడం నిషేధమన్నారు. పర్యాటకులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే స్థానిక పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం



భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లిలోని మంజూర్‌నగర్ స్టార్ పిల్లల ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం గొర్లవీడు గ్రామంలో పిల్లలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ముఖ్యఅతిథిగా హాజరై మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. టీఆర్‌పీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోను వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యంతోపాటు మందులు కూడా అందిస్తామని యాజమాన్యం తరఫున ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్టార్ ఆస్పత్రి డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న సీఐ రమేశ్

వెంకటాపురం(కె) : క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెంపొందుతాయని వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని కాఫడ్ క్రీడా మైదానంలో నిర్వహించిన వెంకటాపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన ది హంటర్‌కు రూ.55,555ల నగదు, షీల్డ్, రన్నర్‌గా నిలిచిన మహాలక్ష్మి ఎలెవన్‌కు రూ.33,333ల నగదు, షీల్డ్, మూడో స్థానంలో నిలిచిన టీచర్స్ ఎలెవన్‌కు రూ.22,222ల నగదు, షీల్డ్, నాలుగో స్థానంలో నిలిచిన చేయూత సాయి సోల్జర్స్‌కు రూ.11,111ల నగదు, షీల్డును అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం శివ, డర్రా దామోదర్, బాలసాని శ్రీను, కాల్వల సుందర్రావ్ తదితరులు ఉన్నారు.

టైరు పేలి టాటా మ్యాజిక్ వాహనం బోల్తా

- తొమ్మిది మందికి స్వల్ప గాయాలు



క్షతగాత్రులను బయటకు తీస్తున్న యువకులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ మీదుగా వేములవాడ వెళ్తున్న టాటామ్యాజిక్ వాహనం టైర్ పేలడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టాటా మ్యాజిక్‌లో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా జంగాలపల్లి నుంచి టాటామ్యాజిక్ వాహనంలో డ్రైవర్‌తో సహా తొమ్మిది మంది వేములవాడకు బయలుదేరారు. ఈ క్రమంలో ఉప్పల్ శివారులోకి రాగానే వాహనం ఎడుమ వైపు ఉన్న ముందు టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై మధు, సిబ్బంది, స్థానిక యువకులు హుటాహుటిన అక్కడకు చేరుకుని టాటామ్యాజిక్ నుంచి క్షతగాత్రలను బయటకు తీసి 108 ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన యనమల్ల సాత్విక ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. అయితే ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు, వారి కుమారుడు సాయి ద్వారా రూ.50వేలు నగదును ఆదివారం స్థానిక నాయకుడు తాడూరి రఘు, మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ ద్వారా నగదును కుటుంబానికి అందజేశారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్‌రావు, కోడి వెంకట్, నూతి రమేష్, పాలకుర్తి శ్రీనివాస్, కోటయ్య, కుమ్మరి చంద్రబాబు, వావిలాల కిషోర్, సప్పిడి వెంకట్రామనర్సయ్య, మెరుగు వెంకటేశ్వర్లు, అశోక్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరిన పేదింటి బిడ్డ

ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన యనమల సాత్విక ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. తల్లి ఆశ వర్కర్ కాగా తండ్రి 2021లో మరణించారు. సాత్విక 6నుంచి 10వ తరగతి వరకు పరకాలలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుకుంది. ఇంటర్ సిద్దిపేటలోని సోషల్ వెల్ఫేర్‌లో చదివి బైపీసీలో 979 మార్కులు సాధించింది. నీట్ పరీక్షల్లో 419 మార్కులు సాధించి ఎస్సీ కేటగిరిలో కరీంనగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకుంది. ఈ సందర్భంగా సాత్విక మాట్లాడుతూ డాక్టర్ అయితే పేదలకు ఉచితంగా వైద్యం చేయడమే మొదటి లక్ష్యమని తెలిపారు. డాక్టర్ కావాలనే పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటును దక్కించుకున్నానని చెప్పారు.

ఆటలు ఆడేదెక్కడ?

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- పిచ్చిమొక్కలతో నిండిన మైదానాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పిచ్చిమొక్కలతో ప్రగళ్లపల్లి క్రీడా ప్రాంగణం



వాజేడులోని క్రీడా ప్రాంగణం

వాజేడు : ఏజెన్సీలోని యువకుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తెలంగాణ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను మంజూరు చేసింది. ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరాదారణకు గురవుతున్నాయి. వాజేడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఏజెన్సీలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు తోడ్పాటు అందించినట్లు అవుతుందని భావించారు. అందుకు అనుగుణంగా గ్రామ పంచాయతీల వారీగా ఆట వస్తువులను కూడా సరఫరా చేశారు. కాని నేటి వరకు యువకులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆట స్థలాల్లో ఆడుకున్న సందర్భం లేదు. దీంతో క్రీడా ప్రాంగణాలు వెలవెల బోతున్నాయి.

యువతకు అవగాహన లేక..

లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు నేడు మరుగున పడుతున్నాయి. ఈ ప్రాంగాణాల్లో యువకులు ఆటలు ఆడిన సందర్భాలు లేవు. అధికారులు కూడా క్రీడా ప్రాంగణాల్లో ఆడాలని గ్రామాల్లోని యువతకు అవగాహన కల్పించలేదు. దీంతో క్రీడా ప్రాంగణాల వైపు యువత దృష్టి సారించడం లేదు. దీంతో ఈ ఆట స్థలాలు మరుగున పడుతున్నాయి.

బీడు భూములుగా ఆటస్థలాలు

ఆటలకు కేటాయించిన స్థలాల్లో యువకలు ఆటలు ఆడకపోవడంతో అవి నిరాదారణకు గురవుతున్నాయి. దీంతో క్రీడా స్థలాల్లో పొదలు, పిచ్చిమొక్కలు పెరిగి చూడటానికి బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. కొన్ని క్రీడా ప్రాంగణాల్లో వర్షాలకు కోతలు ఏర్పడ్డాయి. కొన్ని క్రీడా ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. క్రీడా ప్రాంగణాల వైపు అధికారులు, క్రీడలపై మక్కువ ఉన్న యువకులు చూసిన పాపాన పోవడం లేదు. అడపాదడపా గ్రామ పంచాయతీ స్థాయి, మండల స్థాయి క్రీడలను అధికారులు ఇతర ప్రదేశాలో నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పండగలు, జాతర సందర్భంగా స్థానికులు నిర్వహించే క్రీడలను సైతం వేర్వేరు ప్రదేశాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారిపోయాయి.



నాగారంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు (ఫైల్)

కమ్ముకున్న పొగమంచు

మండలం కేంద్రంలో ఆదివారం పొగమంచు కమ్ముకుంది. కొన్ని రోజులుగా వర్షాలతో అతలాకుతలమైన మండల వాసులు ఆదివారం పొగమంచు కురువడంతో సేద దీరారు. తెల్లవారుజామున ఒక గంట పాటు మంచు తెర కనువిందు చేసింది. ఇది ఆహ్లాదాన్ని పంచినట్లు స్థానికులు తెలిపారు.

– వాజేడు



నాగారం గ్రామంలో కమ్ముకున్న మంచు

కొమురం భీంకు ఘన నివాళి



గోవిందరావుపేట : తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు గొంది కిరణ్ అధ్యక్షతన ఆదివారం కొమురం భీం వర్ధంతిని పస్రాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదివాసీ ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ వట్టం ఉపేందర్ హాజరై మాట్లాడుతూ.. కొమురం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది అని అన్నారు. ఆదివాసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రమణాల లక్ష్మయ్య, నెమలి నర్సయ్య, చింత కృష్ణ, బొల్లెం సారయ్య, కురాకుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944